

మొక్కజొన్న కొనుగోలుకు పేర్లు నమోదు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో మొక్క జొన్న కొనుగోలుకు రైతులు తమపేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. జిల్లాలో 59,174 ఎకరాల్లో రబీ కాలంలో మొక్క జొన్న సాగైందని, గత ఏడాది కంటే ఈ ఏడాది 2500 ఎకరాలు అదనంగా మొక్కజొన్న సాగైందని తెలిపారు. ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి రికార్డు అయ్యిందన్నారు. గత ఏడాది కంటే దాదాపు 9వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 95శాతం మొక్కజొన్న పంట కోతలు పూర్తయ్యాయని, గత పక్షం రోజుల ముందు వరకు మార్కెట్‌లో మొక్కజొన్న కు కనీస మద్దతు ధర (1962 రూపాయలు క్వింటాకు) కన్నా అధిక ధర రైతులకు లభించిందని పేర్కొన్నారు. తరువాత మార్కెట్ రేటు తగ్గడం వల్ల ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఈమేరకు గుర్ల, గజపతినగరం మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇక సి'ఫార్సు'లు చెల్లేనా?

రఘురాజుకు సిఎం హెచ్చరికతో ఎస్.కోటలో చర్చ

తగ్గుతూనే నెగ్గుకొచ్చిన ఎమ్మెల్యే కడుబండి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎమ్మెల్సీ రఘురాజు సిఫార్సులకు ఇక బ్రేకు పడుతుందా? ఆయన నుంచి ఉత్పన్నమౌతున్న రాజకీయ అవాంతరాలు ఎస్.కోట ఎమ్మెల్యే కడబండి శ్రీనివాసరావుకు ఇకపై తొలగనున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఎమ్మెల్యే తగ్గుతునే నెగ్గుకొచ్చారని, ఆ ఓర్పు, నేర్పే పార్టీలో గ్రూపు రాజకీయాలకు చెక్‌పెట్టే సమయం ఆసన్నమైందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపనకు వచ్చిన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హెలీప్యాడ్ వద్ద నాయకులంతా స్వాగతం పలుకుతున్న సమయంలో ఎమ్మెల్సీ రఘురాజును గట్టిగా నిలదీసినట్టు పార్టీ నాయకుల్లో చర్చసాగుతోంది. 'నీకు ఏం అన్యాయం చేశానన్నా? అంటూ ముమ్మాటు ముక్తాయించారని తెలిసింది. కేవలం ఎస్.కోట నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా వున్న రాజకీయ నాయకుల్లోనూ ఇదే చర్చసాగుతోంది. ఇంతకీ రఘురాజు ఏం చేశారో? అని కొంతమంది ఆసక్తికరంగా ప్రశ్నిస్తుండగా, గ్రూపు రాజకీయాలే కారణమని మరికొంతమంది అంటున్నారు. పార్టీకి నష్టం చేస్తే సిఎం జగన్ ఊరుకుంటారా? అంటూ మరికొంతమంది వాదన. వాస్తవానికి ఎమ్మెల్యే కడుబండి ఇప్పటి వరకు గ్రూపురాజకీయాలకు దూరంగానే ఉన్నారు. అలాగని చిన్నచిన్న పనులకు జిల్లాలో ఇతర నేతలపై ఆధారపడే రకం కాదు. నాయకులు, కార్యకర్తల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారం లేదా అభివృద్ధి పనులు, పథకాలకు సంబంధించిన అంశాలపై నేరుగా అధికారులతోనే మాట్లాడడం, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వున్నవాటిని పక్కనపెట్టేయడం కడుబండికి అలవాటు. పని కానప్పుడు కార్యకర్తలు లేదా దిగువస్థాయి నాయకులు నిరాశకు గురికావడం, లేదా కినుకవహించడం వంటివి సర్వసాధారణం. ఇలాంటివాటిని జిల్లాకు చెందిన ఓ నేతతో ఒత్తిడి చేయించి, ఎమ్మెల్సీ తన సిఫార్సులు చెల్లుబాటు అయ్యేలా చూసుకుంటారని సాక్షాత్తు వైసిపి నాయకులే చెప్పుకుంటున్నారు. దీంతో, తన సిఫార్సుకు లేని విలువ, నిబంధనలు, ఎమ్మెల్సీ సిఫార్సులకు ఎలా వచ్చాయంటూ ఎమ్మెల్యే అధికారులను సుతిమొత్తగా నిలదీసిన సందర్భాలూ అనేక ఉన్నాయట. ఇలా ఎమ్మెల్సీ సిఫార్సులకు మాత్రమే పెద్దపీట వేస్తుండడంతో కొంతకాలంగా ఎమ్మెల్యేకు రాజకీయంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా తనను నమ్ముకున్న కార్యకర్తలకు సమాధానం చెప్పుకోలేక, అలాగని ప్రభుత్వ నిబంధనలను పక్కనబెట్టి పనిచేయించు కోలేక సతమతమౌతున్నారు. మరోవైపు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ రాజకీయ జోక్యం, సిఫార్సులు క్రమంగా పెచ్చుమీరాయి. చివరకు ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారంతో పార్టీకి పంపిన ఆకాశరామన్న ఉత్తరాలు కూడా ఎమ్మెల్యేకి చేరాయి. ఈ వైరాన్ని చక్కదిద్దాల్సిన జిల్లా నేతే ఎమ్మెల్సీ సిఫార్సులను ప్రోత్సహిస్తుండడంతో ఎమ్మెల్యేకి ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. నావ మునిగిపోక ముందే ఒడ్డుకు చేరుకోవాలనుకున్న ఆయన ఇటీవల నేరుగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి జరుగుతున్న పరిణామాలను వివరించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో 'అన్నా నీకు ఏం అన్యాయం చేశాను' అంటూ నిలదీయడంతో పాటు మళ్లీ శ్రీనన్నకే సీటు అంటూ నియోకజకవర్గ నాయకులకు అభయం ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్సీని హద్దుల్లో ఉంచాలంటూ సిఎం జగన్ జిల్లాకు చెందిన ముఖ్యనేతకు ఆదేశాలివ్వడంతో ఇకపై సిఫార్సులు చెల్లుబాటయ్యేనా? అన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి.

విద్యార్థులందర్నీ రాష్ట్రానికి రప్పిస్తాం

హెల్ప్ లైన్ ఏర్పాటు చేశాం : విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు నేపథ్యంలో, అక్కడ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులను గుర్తించి రాష్ట్రానికి తీసుకువచ్చే ప్రయత్నాలు ప్రారంభించామని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఇప్పటివరకు సుమారు వంద మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని, ఇంకా ఎవరైనా ఉంటే , రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ ను సంప్రదించాలని సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో విద్యార్థుల పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి స్టూడెంట్స్ పేర్ల జాబితాను సిద్ధం చేశామని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. కేంద్రంలో ఉన్న సివిల్ ఏవియేషన్ మంత్రితో మాట్లాడి విద్యార్థులను రాష్ట్రానికి రప్పించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఒక హెల్ప్‌లైన్ కూడా ఏర్పాటు చేశామన్నారు. సుమారు వందమంది వరకు విద్యార్థులు ఇప్పటివరకు రిజిస్టర్ చేసుకున్నారని, మరో 50 మంది వరకు ఉండవచ్చునని తెలిపారు. 8800925668, 9871999055 హెల్ప్ లైన్ నెంబర్లను విద్యార్థులు, తల్లి తండ్రులు సంప్రదించాలని కోరారు.

అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

అకాల వర్షాల నేపథ్యంలో ఉత్తరాంధ్రలో పెద్దగా పంట నష్టం లేదని బొత్స అన్నారు. ఒకవేళ నష్టం జరిగి ఉంటే ఆ రైతులను



సమావేశంలో మాటాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పక్కన కోలగట్ల

ఆదుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి జిల్లాకు ప్రత్యేకాధికారిని నియమించిందని, వారంతా ఇప్పటికే జిల్లాలకు వెళ్లి పర్యవేక్షించారని అన్నారు. జిల్లాల వారీ సమీక్ష చేసి పంట నష్టాలు నమోదు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. పదో తరగతి ఫలితాలలో 100 శాతం వచ్చే విధంగా వచ్చేఏడాది నుంచి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో బోధనపై దృష్టి పెట్టేలా యాప్ లు భారాన్ని తగ్గిస్తున్నామని చెప్పారు. ఎన్ఇపిని అమలు చేయడంలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు.

ఎల్.కోట కార్యదర్శిపై చర్యలు

లక్కవరపుకోట: లక్కవరపుకోట పంచాయతీ కార్యదర్శి రమణపై సస్పెన్షన్ వేటు పడనున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. కార్యదర్శి రమణ ఏ పనికైనా లంచాలు గుంజుతున్నాడని గత నెల 19న జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. విధులు పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని, ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, సుమారు 8 పంచాయితీ సమావేశాలకు హాజరు కాలేదని పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించలేదన్న అంశాలపై ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావులు ఇటీవల తీర్మానించి డిపిఒ శ్రీధర్ రాజాకు నివేదిక పంపారు. ఈ నేపథ్యంలో ఆయనపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది.

మామిడి, జీడి రైతుల పరిస్థితి దయనీయం

ప్రజాశక్తి - జామి

మామిడి, జీడి రైతుకు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. ఆరుగాలం కష్టపడి వేలకు వేలు మదుపులు పెట్టీ పండించిన పంట రవాణా ఖర్చులకూ రాకపోవడంతో గత నాలుగేళ్లుగా రైతులు అప్పుల పాలవుతున్నారు. జిల్లాలో 75 వేల ఎకరాల్లో మామిడి, 30వేల ఎకరాల్లో జీడి పంటలు సాగువుతున్నాయి. గతంలో మెట్ట భూమిలో వేరుశనగ, గోగు పంటలు పండించేవారు. ఆ పంటలు గిట్టుబాటు కాలేదని, రైతులు క్రమంగా తోటలు వైపు మరలి, మామిడి తోటలు పెంపకం చేపట్టారు. దుక్కు, గొప్పులు, ఎరువులు, పురుగు మందు, తోట కాపలి వంటి ఖర్చులతో మామిడి సాగు తడిసి మోపెడుకావడంతో రైతుకు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. కానీ వాతరవణం మార్పులు, పోగా మంచు, తెగుళ్లు, అకాల వర్షాలు వల్ల మామిడి రైతును నిలువునా దెబ్బతీస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం కరువైంది. జిల్లాలో వరి తర్వాత అతి పెద్ద పంటల్లో మామిడి ఒకటి. అయినప్పటికీ ప్రభుత్వం గుర్తించకపోవడంతో ప్రభుత్వ పంటల బీమాకు నోచుకోని పరిస్థితి ఏర్పడి, నేడు మామిడి రైతు కుదేలైపోతున్నాడు. ఇప్పటి వరకు వేలకు వేలు పెట్టుబడులు పెట్టామని, ఒక్క పైసా కూడా తిరిగి వచ్చే పరిస్థితులు లేవని రైతులు రోదిస్తున్నారు. గతంలో బుట్ట రూ.1000 ధర ఉంటే, ఈ ఏడాది కేవలం రూ.500 కూడా అడగని పరిస్థితి ఉంది.

జీడి రైతుకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారు. జీడి పండించే రైతు ఎక్కువ భాగం గిరిజనులు, దళితులు కావడంతో దళారులు అతి తక్కువకు కాజేస్తున్నారు. గతంలో జిసిసిల ద్వారా పంట కొనుగోలు చేయడంతో ధర అదుపులో ఉండేది. కానీ నేడు జిసిసి కొనకపోవడంతో జీడి రైతు దళారుల బారిన పడి నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మామిడి, జీడి పంటలపై బీమా సౌకర్యం కల్పించి, జిల్లా ప్రోసెసింగ్ యూనిట్లు, కోల్డు స్టోరేజీలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం మామిడి, జీడి పంటలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలోనే నేడు జిల్లా కలెక్టరేట్ ఎదుట మామిడి, జీడు రైతు సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.



మామిడికాయలను బుట్టలు కట్టిస్తున్న రైతు సత్యనారాయణ

కొన్నాళ్లకు మామిడి సాగు కనుమరుగు

ఏటా నష్టపోతున్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే కొన్నాళ్లకు మామిడి సాగు జిల్లాలో కనుమరుగవుతుంది. నేను 10 ఎకరాల మామిడి తోటను మూడేళ్ల కౌలుకు తీసుకున్నాను. ఏటా ఎకరాకు రూ.18 వేలు నుంచి రూ.20వేలు వరకు మధుపులు పెడు తున్నాను. రెండేళ్లుగా పెట్టిన మదుపులు కూడా రాలేదు. ఈ ఏడాది మరీ దారుణం. పదెకరాల పంట రూ.లక్షకు రాని పరిస్థితి. అంటే కనీసం రవాణా ఖర్చులు కూడా తిరిగిరాలేదు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి

పెంటపిల్లి సత్యన్నారాయణ, నీలావతి, గంట్యాడ మండలం

గిట్టుబాటు ధర లేదు



జీడి పంటకు తగిన ధర లేక, ఏటా నష్టపోతున్నాం. ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి, రైతుకు గిట్టబాటు ధర కలించాలి. అందుకు తగిన కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి. బీమా సౌకర్యం కల్పించాలి.

- కుర్ర జమరాజు జీడి రైతు, దబ్బగుంట, ఎస్. కోట మండలం

మామిడి, జీడి రైతును ఆదుకోవాలి



జిల్లాలో మామిడి, జీడి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మామిడి జిల్లాలో 80 శాతం దెబ్బతింది. ప్రభుత్వం అన్ని పంటలకు బీమా కల్పిస్తామని చెప్పి, రైతులకు ద్రోహం చేస్తుంది. గతంలో ఉన్న బీమా కూడా లేకుండా చేస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ముందుకొచ్చి ఎకరాకు రూ.30వేలు నష్ట పరిహారం అందజేసి, రైతులను ఆదుకోవాలి. జీడికి ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి, మామిడికి మార్కెట్ సదుపాయం, కౌలు రైతులకు రుణాలు అందజేయాలి.

- బుద్ధరాజు రాంబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నేడు మహిళాపార్కు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేరింతలు కొట్టేందుకు రెయిన్ డ్యాన్సు, ఈత కొలను, వాకింగ్ ట్రాక్, శారీరక ఆరోగ్యం కోసం జిమ్, పిల్లలకు ఆడుకునే జారుడు బల్లలు, ఉయాలలు అందుబాటులోకి రానున్నాయి. అందుకు వేదికగా మహిళా లోకానికి ప్రకాశం పార్కు సిద్ధమైంది. విజయ నగరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాష్ట్రంలోనే తొలి మహిళా పార్కును సోమవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పర్యాటక శాఖామంత్రి ఆర్‌కె రోజా, శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించనున్నారు. అందుకు నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం పార్కులో పూర్తయిన అభివృద్ధి పనులను మేయర్, డిప్యూటీ మేయర్లు, మహిళా కార్పొరేటర్లు పరిశీలించారు. ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిల్ తీర్మానం మేరకు రూ.98 లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. మహిళలతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు, వ్యాయామం చేసేందుకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించామని చెప్పారు. అందరూ సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని, ప్రవేశాలు, ఇతర అవసరాలకు సంబంధించి త్వరలో విధివిధానాలు ప్రకటిస్తామని తెలిపారు.



మహిళా పార్కు స్వాగత ద్వారం

మహిళా పార్కు ప్రారంభానికి తరలి రండి : మేయర్

నగరంలో మహిళా పార్క్ ప్రారంభోత్సవానికి మహిళలు భారీ సంఖ్యలో తరలిరావాలని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. పార్కు ప్రాంతంలో మహిళా కార్పొరేటర్లతో కలియ తిరిగారు. పార్కులో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్, పిల్లల క్రీడా సామాగ్రి వంటి అంశాలను పరిశీలించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి మహిళల కోసం ప్రత్యేకంగా పార్కును ఏర్పాటు చేసి ప్రారంభించడం గొప్ప విశేషమన్నారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆనంద గజపతి ఆడిటోరియం నుండి 5వేలకు పైగా మహిళలతో ర్యాలీ చేపట్టి ప్రారంభోత్సవ ప్రాంతానికి చేరుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, మహిళా కార్పొరేటర్లు, పైడితల్లమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యులు, వివిధ డివిజన్ల మహిళా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



పార్కులోని పచ్చని చెట్లు

అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కోలగట్ల, సేవా సమితి సభ్యులు



పోరాట యోధుడు అల్లూరి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా దాసన్నపేట రైతుబజార్ వద్ద గల అల్లూరి విగ్రహానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ గతేడాది సేవాసమితి ఏర్పాటు చేసిన విగ్రహం కూడలికి అల్లూరి సీతారామరాజు జంక్షన్ గా నేటి నుండి అధికారికంగా మార్చి నట్లు తెలిపారు. సీతారామ రాజు స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు. జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ అల్లూరి పోరాట పటిమను వివరించారు. అనంతరం సేవా సమితి ఆధ్వర్యాన 500 మంది పేదమహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.రామ రాజు, జిఎస్ఎన్ రాజు, సూర్యనారాయణరాజు, గాదం మురళి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

98 డిఎస్‌సి ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం కోట

1998 డిఎస్‌సి ఉపాధ్యాయ సంఘం ఉమ్మడిజిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం మెసానిక్ టెంపుల్‌లో ఏకగ్రీవంగా జరిగింది. తొలుత తమ ఉద్యోగ అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రిటైర్మెంట్ దగ్గరగా ఉన్న వారిని దృష్టిలో పెట్టుకుని కనీస వయసు 62 ఏళ్లకు పెంచాలని, ఏటా 12 నెలల జీతం వచ్చేలా ఆదుకోవాలని, వయసు పైబడిన వారిని మైదాన ప్రాంతాల్లో వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా తీల్ల రామారావు, ప్రధాన కార్యదర్శిగా బి.ఉమాకామేశ్వరరావు, కోశాధికారిగా మంతిన అప్పలరాజు, గౌరవ అధ్యక్షులుగా పి. వెంకట్రావు, ఉపాధ్యక్షులుగా జిడివి ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎ.రజిని, సంయుక్త కోశాధికారిగా ఎంఎస్ గోపీనాథ్, కార్యనిర్వహక సభ్యులుగా గంప శ్రీదేవి, గంట రాజశేఖర్ నాయుడు, మధుసూదన్‌రావు, దాసరి రమేష్ నాయుడు, పూడి శంకరరావు, జి.వెంకట్రావు, ఎల్‌వి రమణారావు, టి.సీతారాం, చప్ప అప్పలనాయుడు, పతివాడ అప్పలనాయుడు, వై.సత్యం, కె.చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

మెరుగైన సేవలే లక్ష్యం

- తాగునీటి కోసం రూ.60 కోట్లు మంజూరు
- 15నుంచి రాత్రి శానిటేషన్ పనులకు శ్రీకారం
- 'ప్రజాశక్తి'తో నగర పాలకసంస్థ కమిషనర్ శ్రీరాములు నాయుడు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ప్రజలకు సౌకర్యాలు కల్పన, నగరాభివృద్ధి ధ్యేయంగా, ఆరోగ్య వంతమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని నగరపాలకసంస్థ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో ఆయన నగరాభివృద్ధికి సంబంధించిన అంశాలను, నగర పాలక సంస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు.

నగరంలో పారిశుధ్య సమస్య మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

పారిశుధ్యం మెరుగుదలే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. ప్రధానంగా ముగ్గురు పర్మినెంట్ శానిటేషన్ ఇన్స్పెక్టర్లను ఒక్కొక్కరికి 20 డివిజన్లు చొప్పున పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించాం. శానిటేషన్ కార్యదర్శులు ఉదయం 5 గంటలకే మస్తర్ పాయింట్లు వద్దకు వచ్చి కార్మికులతో ముఖ హాజరు వేయించి 5.30 గంటలకు పారిశుధ్య పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నాం. నగర ప్రజలు నిద్ర లేచే సమయానికి నగరం పరిశుభ్రంగా ఉండేలా పనులు చేయిస్తున్నాం.

పెరుగుతున్న నగరవసరాలకు అనుగుణంగా కార్మికుల సంఖ్య సరిపోతుందా?

ఉన్న కార్మికులతో పని చేయిస్తున్నాం. ఈనెల 15నుంచి రాత్రి శానిటేషన్ విధానం అమలు చేస్తున్నాం. దీని కోసం 30మంది కార్మికులతో పని చేయిస్తాం. ఈ పని పూర్తిగా కాంట్రాక్ట్‌కు ఇచ్చాం. శానిటేషన్ పనులు రాత్రి 9 గంటల నుంచి ఉదయం నాలుగు గంటల వరకు నగరంలో ప్రధాన రహదారులు శుభ్రం చేయిస్తాం. ఇప్పటికే ఉన్న కార్మికులను వార్డుల అవసరాన్ని బట్టి కేటాయించాం.

డంపింగ్ యార్డు వల్ల అక్కడి గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలేమిటి?

నగరంలో రోజువారీ వస్తున్న చెత్త డంపింగ్ యార్డులో వేయడం వల్ల లక్షల టన్నుల చెత్త అక్కడ పేరుకుపోతోంది. 16 ఎకరాల డంపింగ్ యార్డులోగల చెత్తను స్టెగ్రిగేషన్ చేయించేందుకు కాంట్రాక్ట్‌కు ఇచ్చాం. అక్కడున్న తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్ట్ ద్వారా క్లియర్ చేశాం. ఏరోజు చెత్త ఆ రోజు తరలిపోయే విధంగా రింగ్ రోడ్డు వద్ద మినీ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం. మిక్స్‌డ్ చెత్తను విశాఖపట్నంలోని ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్నాం.

పార్కుల అభివృద్ధికి చేపడుతున్న చర్యలు?

నగరంలోని పార్కులన్నింటినీ వినియోగంలోకి తీసుకొని రావాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో మొదటి మహిళా పార్కుగా ప్రకాశం పార్కును రూ.98 లక్షలతో అభివృద్ధి చేశాం. ఈనెల 8న మంత్రులు చేతులు మీదుగా ప్రారంభం కానుంది. పెద్ద చెరువు చుట్టూ ఇప్పటికే వాకింగ్ ట్రాక్ వేసి,చుట్టూ ఐరన్ వాల్ కట్టాం. మరో రూ.50లక్షలు కేటాయించాం. పెద్ద చెరువు చుట్టూ అభివృద్ధి చేసిన ప్రాంతాన్ని వినియోగంలోకి తీసుకువస్తాం.

పన్ను బకాయిలు ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నాయి. వసూళ్లకు తీసుకుంటున్న చర్యలేమిటి?



పేరుకుపోయిన పన్నులు బకాయిల వసూలుకు,కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులు క్లియర్ చేసేందుకు ఈ ఏడాది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయ అడ్మిన్లకు నెలవారీ లక్ష్యాలు విధించి పన్నులు వసూలు చేస్తున్నాం. కొన్ని పెండింగ్ కేసులు మీద ఒత్తిడి తేవడం, 5 శాతం రిబెట్ ఇవ్వడం ద్వారా ఈ ఏడాది రూ.15 కోట్లు అదనంగా పన్నులు వసూలు చేస్తున్నాం.

సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలు మెరుగుదలకు తీసుకున్న చర్యలు ఏమిటి?

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తున్నాం. ఎవరు సమయ పాలన పాటిస్తున్నారు, సాయంత్రం వరకు వారు ఏ పని చేశారు అనేది వారానికి ఒక రోజు సమీక్షించి వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రతి రోజూ ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు వారికి వచ్చే గ్రీవెన్సులు పరిష్కారం చేసుకునేలా ఆదేశాలు ఇచ్చాం.

నగరంలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయి. ఎంత మొత్తం కేటాయించారు?

రూ.45 కోట్లతో అన్ని వార్డుల్లోను అభివృద్ధి పనులు చేపట్టాం. ఇప్పటికే 35 కోట్లు విలువ చేసే పనులకు టెండర్లు పిలిచి పనులు చేయిస్తున్నాం. మరో రూ.9 కోట్లు అభివృద్ధి పనులకు టెండర్‌లు పిలిచాం. ఆ పనులు త్వరలో పూర్తి చేస్తాం.

ప్రధాన జంక్షన్ల అభివృద్ధి పనులు ఎంతవరకు వచ్చాయి?

ఇప్పటికే కొన్ని జంక్షన్ల బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాం. ఎత్తుబ్రిడ్జి, అంబేద్కర్ జంక్షన్, కలెక్టరేట్ ఎన్‌టిఆర్ విగ్రహం జంక్షన్, కొత్తపేట జంక్షన్, రింగ్ రోడ్డు, రైతు బజారు జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, కలెక్టరేట్ ఎదుట జ్యోతిరావు పూలే జంక్షన్ వంటివి అభివృద్ధి చేశాం. ఇంకా మయూరి జంక్షన్, వైఎస్ఆర్ విగ్రహం జంక్షన్, బుద్దుని విగ్రహం జంక్షన్‌లను త్వరలో అభివృద్ధి చేస్తాం.

రోడ్డు విస్తరణ పనులు ఎప్పటికి పూర్తవుతాయి?

గూడ్స్‌షెడ్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. రైల్వే వారితో చర్చలు జరిగాయి. త్వరలో పనులు పూర్తవుతాయి. ఉడా ఆధ్వర్యంలో అర్ అండ్ బి జంక్షన్ నుండి పాల్ నగర్ వరకు రూ.4 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరగనున్నాయి. రింగ్ రోడ్డు నుంచి ధర్మపురి, రామకృష్ణ నగర్ మీదుగా రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం.

తాగునీటి సరఫరా మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

నగరంలో ఇప్పటికే రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నాం. రోజురోజుకూ జనాభా పెరగడంతో నీటి అవసరాలు కూడా పెరిగాయి. అమృత పథకం కింద అభివృద్ధి కోసం రూ.60 కోట్లు మంజూరైంది. దీని ద్వారా కె ఎల్ పురం, బిసి కాలనీ, ధర్మపురి వంటి ప్రాంతాల్లో కొత్త పైపు లైన్‌లు వేయడం, టాంక్‌లు నిర్మించి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏడాది లోపు ఈ పనులు పూర్తి చేస్తాం.

మండలానికి చేరిన బోర్‌వెల్ స్పేర్ పార్ట్స్

రేగిడి: మండల కేంద్రానికి 15వ ఆర్థిక సంఘం నిధులతో బోర్ వెల్ స్పేర్ పార్ట్స్ వచ్చినట్లు ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీ చరణ్ శనివారం తెలిపారు. మండలంలో 39 గ్రామపంచాయతీలకు సంబంధించి ఉన్న బోర్లు మరమ్మత్తులు, కొత్త బోర్లు వేయడానికి రూ. 5లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి తెప్పించినట్లు వెల్లడించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా కొత్త బోర్లు, బోర్లు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

వేపాడ: మండలంలోని బికెఎన్‌పేట వద్ద గల ఏపీ ఆదర్శ పాఠశాలలో 2023-2024 సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆర్ ఈశ్వరరావు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టిలు రూ. 75, ఒసి, బిసిలు రూ.150 చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 11న ఆదర్శ పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టాలు మంజూరు చేయాలని 9న ధర్నా



గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు


మెంటాడ: మండలంలో ప్రభుత్వ భూములను పంచాలని, సాగుచేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా ప్రభుత్వ భూములను పంచాలని, ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న భూములను పేదలకు పట్టాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదిన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వంట, వార్పు, నిద్ర కార్యక్రమం ద్వారా నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ జిల్లా సహాయ కార్యదర్శి తామారాపల్లి సోములు పాల్గొన్నారు.

డిఎస్‌పికి ఘన సన్మానం



డిఎస్‌పి దంపతులను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీ

బొబ్బిలి : ప్రజా పితా బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంస్థ కేంద్ర ఇంఛార్జ్ బి. కె. రాజేశ్వరి ఆధ్వర్యంలో ఆదివారం డిఎస్‌పి మోహన్‌రావు దంపతులను ఘనంగా సత్కరించారు. బ్రహ్మ కుమారిస్ దివ్యానుభూతి జ్ఞాన మందిరం బొబ్బిలిలో ఈ సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. డిఎస్‌పిగా ఇక్కడ బాధ్యతలు వహించి విశాఖ బదిలీ అయిన సందర్భంగా ఆయనకు ఈ సత్కారం చేసినట్లు రాజేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారిస్, బాబా పరివారం, సైనికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్షత్రియ సేవా సమితి సభ్యులు, అధికారులు

విమానాశ్రయానికి అల్లూరి పేరుపెట్టాలి

కొత్తవలస: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని క్షత్రియ సేవా సమితి కార్యదర్శి పాకలపాటి శ్రీనివాస వర్మ డిమాండ్ చేశారు. మన్యం వీరుడు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 99 వర్ధంతి సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, కొత్తవలస క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్‌డిటి రమేష్ మాట్లాడుతూ అల్లూరి మహోన్నతమైన వ్యక్తి అన్నారు. అల్లూరి అంకుటిత దీక్ష నేటి తరాలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అల్లూరి సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం గతేడాది ఆజాద్‌కి అమృత్ ఉత్సవాలను నిర్వహించి గౌరవించిందన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు గోపిరాజు, విఆర్‌ఒలు, సిబ్బంది, వత్సవాయి బంగార్రాజు, గొట్టుముక్కల వెంకటపతి రాజు, శ్రీను రాజు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధులను ఆదుకోండి

కొత్తవలస: ఒంటిరి వృద్ధులను ఆదుకోవాలని ఫర్ద పీపుల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విశ్వనాథ హరికుమార్ కోరారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో ఆదివారం 36 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. వైద్యులు రవికుమార్, ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడానికి ఎంతో దృక్పథం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ శ్రావణ్ కుమార్, గోవిందరావు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న పందిరి ఉత్సవం

భోగాపురం: భోగాపురంలో దుబ్బాక వారి కుటుంబ సభ్యులు జరుపుకుంటున్న సింహాద్రి అప్పన్న పందిరి మహోత్సవంలో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భోగాపురం మండల సీనియర్ నాయకులు నీలపు అప్పలరామి రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కవులవాడ గ్రామంలోని శ్రీ హనుమత్ సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భోగాపురం టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ దంతులూరి సూర్యనారాయణరాజు, కవులవాడ ఎంపిటిసి కోరాడ తాతరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో రాష్ట్రం అంధకారం

భోగాపురం: వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి లేక అంధకారంలో మగ్గుతుందని జనసేన నెల్లిమర్ల నియోజకవర్గం నాయకులు లోకం ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సభలో మాట్లాడుతూ భోగాపురంలో విమానాశ్రయం శంకుస్థాపన వల్ల ఒరిగిందేమీ లేదని అన్నారు. మత్స్యకారులు కావాల్సింది జట్టి అని బోటింగ్ జట్టి వల్ల మత్స్యకారులకు ప్రయోజనం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, చక్రవర్తి, రవితేజ, ఖాన్, జనసేన భోగాపురం మండల అధ్యక్షులు వందనాల రమణ, నియోజకవర్గ సీనియర్ నాయకులు పల్ల రాంబాబు, జోగారావు, పైల శంకర్, గోవిందు, సతీష్, పల్లంట్ల జగదీష్, రాంచంద్ర, వీర మహిళలు అట్టాడ ప్రమీల, బాసి దుర్గ, హైమ, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ అన్నారు. గంజాయి నివారణకు నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి విక్రయి ంచిన, వినియోగించిన చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్ధాలకు అడ్డుకట్ట వేసేందుకు నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశాలను తనిఖీ చేస్తున్నామని చెప్పారు. కృష్ణాపురం రోడ్డు, కోటి చెరువు గట్టు, క్రీడా ప్రాంగణం దరి తోటలు, ఇందిరమ్మ కోలనీ తదితర ప్రదేశాలను తనిఖీ చేసి అనుమానితులను విచారించా మన్నారు. గంజాయి నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఆయనతో ఎస్‌ఇబి సిబ్బంది ఉన్నారు.

ఆదర్శం.. ఆయన సాగు విధానం..

● ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం ● ఏడాదికి రెండు పంటలు ● పలువురు రైతులకు వ్యవసాయంపై సలహాలు, సహాయం ● ఎపి సీడ్స్‌కు విత్తనాలు సరఫరా

ప్రజాశక్తి- రేగిడి

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా పనిచేస్తున్న గేదెల వెంకటేశ్వరరావు తన తండ్రి గేదెల రాజగోపాల నాయుడు నుంచి వ్యవసాయంలో వారసత్వాన్ని అందిపుచ్చుకుని వ్యవసాయంపై దృష్టి సారించారు. సాగులో ఆధునిక విధానాలను అనుసరిస్తూ మంచి దిగుబడులతో ఫలితాలు సాధిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సీడ్స్‌కు విత్తనాలను కూడా సరఫరా చేసే స్థాయికి ఎదిగి తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంతో బిజీ షెడ్యూల్‌లో ఉన్నా వ్యవసాయం పై మక్కువ చూపి ఆదర్శ రైతుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు.

మండలంలోని ఉణుకూరు గ్రామానికి చెందిన గేదెల వెంకటేశ్వరరావు తరతరాలుగా వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారు. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు వ్యవసాయం చేస్తూ వ్యవసాయం పై పట్టు సాధించారు. ఆ వ్యవసాయమే వృత్తిగా బావించి ఇష్టం పెంచుకున్నారు. తనకు ఉన్న 56 ఎకరాలు పొలంలో 1121 రకం, 1064 రకం, 1156 రకాలతో సాగు చేస్తుంటారు. ఖరీఫ్, రభీకు సంబంధించి ఏడాదికి రెండు పంటలు పండిస్తుంటారు. 20 రకాలకు చెందిన సీడ్స్‌తో పంటలు పండిస్తుంటారు. ఏపీ సీడ్స్‌కు 3వేల క్వింటాలు విత్తనాలను ఏటా పంపిస్తుంటారు. పంటలకు ఎటువంటి ఎరువులు వాడాలో ఆయనకు బాగా తెలుసు. వేసవి సేంద్రియ



జెడి, ఎడిలకు పంటల పై వివరిస్తున్న రైతు గేదెల వెంకటేశ్వరరావు

ఎరువులు వేసి భూమిని సారవంతం చేయడం, గొర్రెల మందలను వేయించడం వంటివి చేస్తుంటారు. దీనివల్ల వరి పంటలకు అవసరమైన పోషకాలు భూమి నుంచి లభిస్తాయని ఆయన చెబుతుంటారు. రైతు వెంకటేశ్వరరావు పొలాన్ని మెత్తగా దుక్కు చేయించి పచ్చి రొట్ట సాగు చేస్తుండటం వల్ల వరి పంటకు క్రిమి కీటకాలు ఆశించవని చెబుతున్నారు. ఆధునిక విధానంలో సాగు చేయడం వల్లే పంటలు దిగుబడులు సాధిస్తున్నామన్నారు. ఎకరానికి 33 బస్తాల నుంచి 39 బస్తాల వరకు వస్తున్నట్లు పేర్కొన్నారు.



రైతు వెంకటేశ్వరరావు

శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ..

వ్యవసాయానికి సంబంధించి పంటలపై వ్యవసాయ అధికారుల, శాస్త్రవేత్తల సూచనలు తూచా తప్పకుండా పాటిస్తూ సాగు చేస్తుంటారు. వరి సాగును ఎక్కువగా డ్రమ్ము సిడర్ విధానంలో చేపడుతున్నారు. దీంతో పెట్టుబడులు తగ్గించుతున్నట్లు చెబుతున్నారు. పొలంలో కాలిబాటలు తప్పనిసరిగా తీయాలని, ఆయన తోటి రైతులకు సూచిస్తుంటారు. గత 22 సంవత్సరాలుగా పండిన పంటలను విత్తనాల రూపంలో ఏపీ సీడ్స్‌కు అందిస్తూ అధిక ఆదాయాన్ని అర్జిస్తున్నారు. వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటించడంతో చీడ పీడలు అదుపులో ఉండడంతో పాటు మంచి దిగుబడులు సాధిస్తున్నారు. కోతకు మళ్లీ క్రాప్ కవర్‌ను వినియోగిస్తున్నానని, దీనివల్ల పని మరింత సులభతరం అవుతుందని అన్నారు. తోటి రైతులకు వ్యవసాయ యంత్రాలను పనులకు ఇస్తూ, వారికి సహాయం చేయడం ఎంతో సంతోషంగా ఉందని రైతు వెంకటేశ్వరరావు చెబుతున్నారు.

పేదలకు తప్పని జాగా(రం) కష్టాలు

● ఏళ్లు గడుస్తున్నా ఇళ్ల స్థలాలు కేటాయింపు శూన్యం
● ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పేదలు ఇళ్ల స్థలాలు కోసం ఏళ్ల తరబడి జాగారం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు లేక దశబ్దకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే మూడేళ్ల క్రితం ఇళ్ల స్థలాలిస్తామని చెప్పిన ప్రభుత్వం పట్టాలైతే ఇచ్చింది కానీ వారికి ఇంత వరకూ స్థలం మాత్రం కేటాయించలేదు. దీంతో నిరు పేద కుటుంబాలకు చెందిన ప్రజలు పలుమార్లు రోడ్డెక్కారు. ధర్నాలు, రాస్తారోకోలు, వినతి పత్రాలు ఇచ్చినా ఈ ప్రభుత్వంలో చలనం రాలేదు. దీంతో చేసేదేమీ లేక పేదలు ఇళ్ల స్థలాలు కోసం ఎదురు చూస్తున్నారు.

నెల్లిమర్ల గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఇళ్ల స్థలాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో పేదలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టగా సర్వే జరిపి1100 మంది నిరుపేదలను గుర్తించి అర్హుల జాబితాను కూడా తయారు చేసి ప్రకటించారు. అప్పట్లో పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ స్థలం (ప్రస్తుత డంపింగ్ యార్డు), మిమ్స్ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని కూడా ఇళ్ల స్థలాల కోసం సర్వే జరిపారు. అన్నీ పూర్తయినప్పటికీ పేదలకు స్థలాలు మాత్రం ఇవ్వలేదు. అప్పటి నుంచి ఇళ్ల స్థలాల కోసం పేదలు ప్రయత్నాలు చేస్తునే ఉన్నారు. గ్రామ పంచాయతీ కాస్త నగర పంచాయతీగా మారింది. కానీ పేదల ఇళ్ల స్థలాల సమస్య మాత్రం మారలేదు.

తప్పని నిరాశ

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ళు లేని పేదలకు స్థలం ఇవ్వడంతో బాటు నిర్మాణం కూడా చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో పట్టణ పేదలు ఇళ్ల స్థలాల సమస్య తీరుతుందని ఆశ పడ్డారు. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం వైసిపి ప్రభుత్వం 1500 మంది పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలను



పేదలకు కొండపై కేటాయించిన ఈ స్థలాన్నే తిరస్కరించారు..

కూడా పంపిణీ చేసింది. అయితే స్థలాలు మాత్రం కేటాయించలేదు.

టిడ్కో ఇళ్ల పరిస్థితీ అంతే

అంతకుముందు టిడిపి హయాంలో టిడ్కో పేరుతో లబ్దిదార్లు నుంచి వాయిదాల రూపంలో నగదు వసూలు చేసి ఇళ్ళు నిర్మించి ఇవ్వడానికి ప్రయత్నాలు చేశారు. ఇందులో భాగంగా టిడ్కో నిర్మాణాలు కూడా జరిగాయి. అయితే అవి కూడా ఇంతవరకు ఇవ్వలేదు. దీంతో డబ్బులు చెల్లించిన నిరు పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

కొండ మీద స్థలం కేటాయించడంతోనే..

నెల్లిమర్లలో నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం అధికార్లు టిడ్కో ఇళ్ల పక్కన కొండ మీద స్థల సేకరణ చేశారు. అక్కడ ఎటువంటి వసతులూ, సదుపాయాలూ లేకపోవడంతో నగర పంచాయతీ పేదలు ఆ స్థలంపై విముఖత చూపి తిరస్కరించారు. దీంతో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, అధికార్లు పేదలకు వేరే చోట ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని చెప్పారు.

1500 మందికి పట్టాలు.. 62 మందికి స్థల కేటాయింపు..

నగర పంచాయతీ పరిధిలో 1500 మంది పేదలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున పట్టాలు మంజూరు చేసింది. అయితే ఇందులో 62 మందికి మాత్రమే ఎంపిడిఒ కార్యాలయం పక్కన పంప్ హౌస్ వద్ద ఇల్లు నిర్మాణాలు చేపట్టి మిగిలిన వారి గోడును పట్టించుకోకుండా ప్రభుత్వం వదిలేసింది. పలుమార్లు ఎమ్మెల్యే, అధికార్లు చుట్టూ తిరుగుతున్నా అదిగో ఇదిగో అంటూ గత మూడేళ్లుగా కాలక్షేపం చేస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలోని చంద్రబాబు నగర్ సర్వే నెంబర్ 59, 60, 61, 73, పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు విన వస్తున్నాయి. సర్వే నెంబర్316లో ప్రభుత్వ స్థలం 46 ఎకరాలు మిగులు భూమి, డైట్ వద్ద, పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ స్థలం ఉందని ఆ స్థలాల్లో పేదలకు ఇళ్ల కేటాయిస్తే సరిపోతుందని పేదలు చెబుతున్నా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పెడ చెవిన పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన లబ్దిదార్లకు ఇళ్ల స్థలాలు చూపించాలని కోరుతున్నారు.

రేపు రామాలయం ప్రతిష్ట

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోదవలస పంచాయతీ పరిధిలోని గొండయ్యపాలెంలో మంగళవారం రామాలయ యంత్ర శిఖర విగ్రహ ధ్వజస్తంభం ఆలయ ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కాళ్ల రామసూరి, ఆలయ ధర్మ కర్త గంటా శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజులు పాటు నిర్వహించనునన్న వేడుకల్లో తొలి రోజు యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ట, ప్రధాన హోమాలు, రెండో రోజు వేద పారాయణాలు, సూర్య నమస్కారాలు, రుద్రాభిషేకం, మూడో రోజు విగ్రహాలు ఊరేగింపు, ప్రతిష్ట, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కాగా ఈ మూడు రోజులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మొదటి రోజు సన్నాయి మేళం, కోళాటాలు, కేరళ డప్పు వాయిద్యాలు, రెండో రోజు పౌరాణిక ఘట్టంలో రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర కాటిసీను, మూడోరోజు కూచిపూడి భరత నాట్యం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



రామసూరి



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రామాలయం

వేడుకగా సత్యనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ట

నెల్లిమర్ల: మండలంలోని కొత్తపేట గ్రామం సమీపం, రామతీర్థం రోడ్డు వద్ద శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. వేద పండితులతో వేదమంత్రాల మధ్య విగ్ర ప్రతిష్ట మహోత్సవం కన్నుల పండువుగా జరిగింది. అనంతరం ప్రత్యేక పూజలు తీర్థప్రసాదాలు భక్తులకి అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో పలువురు ముఖ్య నాయకులు, అధికారులు, భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కళ్యాణ మండపం కూడా నిర్మించి ఇక్కడే కళ్యాణాలు చేసుకునే విధంగా శ్రీ సత్యనారాయణ స్వామి వారి ఆశీస్సులతో అన్ని ఏర్పాట్లు సమకూరుస్తామని తెలిపారు. సోమవారం జరిగే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలకు అందరూ హాజరై వ్రత పూజలు చేయించుకోవాలని కోరారు. ఈ సంధర్భంగా కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు, ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, కొత్త పేట సర్పంచ్ అట్టాడ శ్రీను, టిడిపి మండల అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, మాజీ సర్పంచ్ గురాన అసిరి నాయుడు తదితరులు ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.



దర్శనం చేసుకుంటున్న ఎంపిపి దంపతులు

కెజిబివిని పరిశీలించిన కమిషనర్

డెంకాడ : మండలంలోని మోపాడలో ఉన్న కెజిబివి పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ శనివారం రాత్రి పరిశీలించారు. ఈ పాఠశాల పదో తరగతి పరీక్షలో నూటికి నూరు శాతం సాధించినందుకు గాను ఆయన పరిశీలనకు వచ్చారు. పాఠశాలలో 36 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయిగా 36 మంది కూడా ఉత్తీర్ణత అయ్యారు. వీరిలో 28 మంది మొదటి స్థానంలో, ఏడుగురు రెండువ స్థానం, ఒక్కరు మూడో స్థానంలో ఉత్తీర్ణత చెందారు. వీరిని కమిషనర్ అభినందించారు. ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ ముున్ముందు ఇలాగే ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భవానీతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ సురేష్‌కుమార్

వేసవి విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. గ్రంథాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను ఆయన మోపాడలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంకాడ, భోగాపురం మండల కేంద్రాల్లో ఉన్న గ్రంథాలయాలు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాలు 11వ తారీకు వరకు నిర్వహిస్తారన్నారు. గ్రంథాలయాల్లో కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం, చిత్రలేఖనం వంటి సృజనాత్మక కార్యక్రమాలు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి మహేష్ పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఆదిత్య విద్యార్థికి 'సైనిక్' సీటు

నెల్లిమర్ల : స్థానికనగర పంచాయతీ పరిధిలోని శ్రీ ఆదిత్య విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి అట్టాడ తరుణ్ తేజ 2023 కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సీటు సంపాందించాడు. ప్రవేశ పరీక్షలో 400 మార్కులకు గాను 322 మార్కులు సాధించి ఆలిండియా ర్యాంకు 914 సాధించి కోరుకొండ సైనిక్ స్కూలు చిత్తూరు జిల్లా కలికిరి సైనిక్ స్కూల్లో సీటు సాధించాడు. తనను పాఠశాల కస్పాండెంట్ డాక్టర్ వి. సూరిబాబు, ప్రధానోపాధ్యాయులు వి.అమృత, తల్లిదండ్రులు, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నేరాలు ఘోరాలు

ఆటో అదుపుతప్పి బోల్తా

వంగర: మండలంలోని అరసాడ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో అరసాడ గ్రామానికి చెందిన ఓ తండ్రి కుమార్తెకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని స్థానికులు 108 అంబులెన్స్ సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న 108 ఈఎంటి జగదీష్, పైలెట్ పవన్ గాయపడిన వారికి అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందించి అనంతరం రాజాంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామానికి చెందిన రావాడ తులసి అనే మహిళ అదృశ్యమైనట్లు తండ్రి చిప్పాడ ఏర్నిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏఎస్‌ఐ ఆర్‌విఐ నర్సింగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు కథనం ప్రకారం భర్తతో గొడవపడి ఇంటిలో నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ నెల 5 తేదీన వెళ్లిపోయిన తులసి గురించి గాలించామని, ఆచూకీ తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ప్రజలపై భారాలు తగ్గించాలి

భోగాపురం: వైసిపి హయాంలో నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, గడచిన నాలుగేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ కర్రతో బంగారు రాజు అన్నారు. మండలంలోని ముక్కాం గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ గతంలో జగన్ రెడ్డి పాదయాత్ర సమయంలో సంపూర్ణ మద్యపానం నిషేధం చేస్తానన్నారు కానీ నేడు చేయకపోగా లేనిపోని బ్రాండ్లతో రేట్లు పెంచి ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి రాజధాని లేని విధంగా తయారు చేసిన ఘనత జగన్ రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, భోగాపురం మండల సీనియర్ నాయకులు నీలపు అప్పలరామి రెడ్డి, ముక్కాం ఎంపిటిసి గనగల్ల బాబాజీ, మండల లీగల్ సెల్ అధ్యక్షులు గరికిన చిన్న రాములు, గ్రామ టిడిపి అధ్యక్షులు గనగల్ల గారగయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు


బానాదిలో టిడిపి సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

మండలం బానాదిలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి యువ నాయకులు గొంప కృష్ణ మాట్లాడుతూ ఈనెల 18న నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభ జరుగనున్నందున ఏర్పాట్లును కలిసి కట్టుగా చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎన్ని కష్టాలు వచ్చిన నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానాన్ని తెలుగుదేశం పార్టీ సొంతం చేసుకునేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు సభను విజయవంతం చేస్తే మనకు మంచి గుర్తింపు వస్తుందని చెప్పారు. ఆయన అధికారంలోకి వస్తే తప్ప రాష్ట్రంలో ప్రజలకు న్యాయం జరగదన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో కచ్చితంగా చంద్రబాబు సిఎం అయ్యే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో వైసిపి అరాచకాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. ఇందులో భాగంగా ఇదేం కర్మ కార్యక్రమాల్లో కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు గుమ్మడి భారతి, జనపరెడ్డి ఈశ్వరరావు, ఎస్ గణేష్, ఎం వెంకటరమణ, సిరికి రమణ, మంచిన అప్పలసూరి, గొర్రె నాగరాజు, సేనాపతి అప్పారావు, కొట్టానా అర్జున, కొట్టాడ వెంకటరావు, తాడి కృష్ణ, వెంకటరావు, కామేష్, సిరికి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆత్మీయ సమ్మేళనం

మండలంలో ఆదివారం టిడిపి ఆత్మీయ సమ్మేళన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ హాజరై మాట్లాడారు. పార్టీ పూర్వ వైభవానికి మనందరం కష్టపడి పని చేయాలన్నారు. చంద్రబాబు నాయుడును 2024లో ముఖ్యమంత్రిగా చేయడమే ప్రధాన ధ్యేయంగా ముందుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలో చంద్రబాబు సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పోతల రమణ, కె. రమణ మూర్తి, జి కృష్ణ, సిహెచ్ వెంకటరావు, గాలి నాయుడు టీచర్, ఎన్ ముత్యాలు నాయుడు, రంభ శంకర్రావు, సూరిబాబు, దాసరి లక్ష్మి, జి రాము తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న యువ నాయకులు గొంప కృష్ణ